క్లుప్తంగా

మిర్చి, పత్తి బస్తాలను షెడ్డుల్లోనే పెట్టాలి

వరంగల్: వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా అకాల వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించిన హెచ్చరికల నేపథ్యంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకువస్తున్న మిర్చి, పత్తి బస్తాలను రైతులు, అడ్తి, ఖరీదుదారులు యార్డుల్లోని షెడ్డుల్లోనే భద్రపర్చాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులు, వ్యాపారస్తులు గమనించాలని కోరారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

హన్మకొండ: భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా నీ అమ్మ అని మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ కోసం ఈటల రాజేందర్ జైలుకు వెళితే ఓటుకు నోటు కేసులో అరెస్టై జైలుకు వెళ్లి బెయిల్‌పై బయట తిరుగుతున్న వ్యక్తి రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వ్యాపార భాగస్వామి అయిన రేవంత్ రెడ్డికి బీసీ నాయకుడు ఈటల రాజేందర్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదని తెలిపారు.

ఈటల రాజేందర్ బీసీ అయినందునే టార్గెట్

కాశిబుగ్గ: బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీసీ కాబట్టే ఆయనను టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాజకీయంగా టార్గెట్ చేస్తున్నారని వరంగల్ తూర్పు బీజేపీ ముఖ్య నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓటుకు నోటుకు కేసులో జైలుకు వెళ్లివచ్చాక రేవంత్‌రెడ్డి ఎందుకు ప్రమాణం చేయలేదని పేర్కొన్నారు. రూ.40 కోట్లు ఇచ్చి పీసీసీ చీఫ్ పదవి తెచ్చుకున్నారని కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు విమర్శించినప్పుడు రేవంత్ అప్పుడు ఎందుకు ప్రమాణం చేయలేదని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీకి రూ.25 కోట్లు కేసీఆర్ ఇచ్చారని ఈటల రాజేందర్ అనగానే చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి ఆలయంలో రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు.

వచ్చే నెలలో వ్యాగన్ ఫ్యాక్టరీకి మోదీ శంకుస్థాపన


హన్మకొండ: కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. అయితే, ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌ను తీసుకొచ్చే దమ్ముందా అని ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. వ్యాగన్ ఫ్యాక్టరీకి 160 ఎకరాలు కేటాయించాల్సి ఉండగా, 150 ఎకరాలు ఇచ్చి పదెకరాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని పేర్కొన్నారు.

మా సిటీలోని కార్మికుల స్థలాల పరిశీలన



నయీంనగర్: హసన్‌పర్తి మండలం మా సిటీలో కేటాయించబోతున్న స్థలాలను మోడిఫైడ్ వలంటరీ రిటైర్డ్ -2002 అజంజాహి మిల్లు కార్మికులు ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం కార్మికుల బాధలు, కష్టాలను పరిగణలోకి తీసుకొని మా సిటీలో కాకుండా అజంజాహి మిల్లు ప్రాంతంలో కార్మికుడికి 200 గజాల చొప్పున 313 మంది కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. కార్మికుల నివాస ప్రాంతాలకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా సిటీలో స్థలాలు కేటాయించడం అన్యాయమని వాపోయారు. కార్మికులందరూ ఏకమై అజంజాహి మిల్లు ప్రాంతంలోనే స్థలాలు సాధించడానికి కార్యాచరణ చేపట్టాలని తీర్మానించారు.

ప్లీనరీని జయప్రదం చేయాలి



ఖిలా వరంగల్: ఈనెల 25న వరంగల్ ఓసిటీ మైదానంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీకి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ నాయకులు బిల్లా శ్రీకాంత్, బోగి సురేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ తూర్పుకోటలో బిల్లా రవి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో జరగనున్న ప్లీనరీని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంగర బోయిన ఉమేష్, వాసు, ఎల్లయ్య, ఉల్ఫత్, శ్రీధర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంలో పాడు పనులు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఖిలా వరంగల్
- మధ్యకోట రోడ్డుపై అర్ధరాత్రి వరకు కబుర్లతో ప్రేమ జంటల కాలక్షేపం
- నిఘా లోపంతో ఆకతాయిల ఇష్టారాజ్యం
- టాస్క్‌ఫోర్స్‌కు చిక్కినా మారని తీరు
- భయాందోళనలో స్థానికులు, పర్యాటకులు



చింతల్ నుంచి మధ్యకోటకు వెళ్లే ప్రధాన మార్గం



రాతికోటపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

ఖిలా వరంగల్: పర్యాటక కేంద్రమైన ఖిలా వరంగల్.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇక్కడ నిర్జన ప్రదేశాలు ఎక్కువగా ఉండడంతో మద్యంప్రియులు, ఆకతాయిలు తిష్టవేస్తున్నారు. ప్రధానంగా చింతల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి మట్టి, రాతి కోట వెంట పొదలమాటున, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఖాళీ స్థలాల్లో పోకిరీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన పర్యాటకులను బెదిరిస్తున్నారు.

బెదిరింపులకు దిగుతున్న ఆకతాయిలు

పర్యాటక ప్రదేశాలకు వివిధ జిల్లాల పర్యాటకులు, యువతీ యువకులు ఎక్కువగా వస్తుంటాయి. ఈక్రమంలో అర్ధరాత్రి వరకు కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చే ప్రేమ జంటలు కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాయి. ఈక్రమంలో కోటలో ప్రవేశించిన ప్రేమ జంటలను జులాయిగా తిరిగే యువత బెదిరించి వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను కాజేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసుల నిఘా, గస్తీ లేకపోవడంతోనే అసాంఘిక శక్తులు ఎక్కువ తిష్ట వేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరానికి అత్యంత సమీపంలో పల్లెటూరు వాతావరణం ఉండటంతో చాలామంది ఇటు వైపు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మధ్యకోట పరిసరాల్లో పురాతన ఆలయాలు, పంట పొలాలు, నిర్జన ప్రదేశాలు ఉండడంతో ప్రేమికులు సేద తీరుతున్నారు. అటువైపు పోకిరీలు సంచరిస్తూ పర్యాటకులను బెదిరిస్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు.

కొరవడిన పోలీసుల నిఘా

చింతల్ రహదారిలోని నిర్జన ప్రదేశాల వైపు పోలీసుల పర్యవేక్షణ ఉండటం లేదు. ఈ ప్రాంతం కోట సమీపంలో ఉన్న మిల్స్‌కాలనీ పరిధిలోకి వస్తుంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో బ్లూకోట్స్ పోలీసుల గస్తీ పెంచితే అసాంఘిక ఘటనలు జరగకుండా ఉంటాయని పలువురు చెబుతున్నారు. వాకింగ్‌కు వచ్చే మహిళలను ఆకతాయిలు భయందోళనకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారులు 22మంది జులాయిలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. అయినా అలాంటి వారిలో మార్పు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల చింతల నుంచి మధ్యకోటకు వెళ్లే దారి, రాతికోట మెట్ల మార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా ఆకతాయిల తీరు మారడం లేదని తెలుస్తోంది. ఇకనైనా మిల్స్‌కాలనీ పోలీసులు నిఘా పెంచాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నిఘా పెంచాం..



పర్యాటక ప్రదేశాల్లో నిఘా పెంచాం. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నాం. స్వయంగా తానే దృష్టి సారించా. ప్రతిరోజు పర్యాటకులు స్వేచ్ఛగా కోట అందాలను వీక్షించే వాతావరణం కల్పించాం. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే పర్యాటకులు, ప్రజలు మా దృష్టికి తీసుకురావాలి.

– ముస్క శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్

‘శ్వేతార్క’లో వేడుకలు ప్రారంభం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- విశేష పూజలందుకున్న శ్వేతార్కుడు



వేడుకలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దంపతులు

కాజీపేట: వేలాదిమంది భక్తుల కోలాహలం మధ్య కాజీపేట పట్టణంలోని శ్వేతార్క మూలగణపతి 25వ వసంతోత్సవ (పుట్టినరోజు) వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్సవాలను కార్పొరేటర్ రవీందర్ యాదవ్, జక్కుల రమ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. శ్వేతార్కుడికి పంచామృతాభిషేకం, చందనోత్సవ అలంకార దర్శనం, వినాయక వ్రతపూజ, కోటినామ పారాయణం, మహాగణపతి హోమం, సహస్ర గౌరీపూజలు కనులపండువగా సాగాయి. పార్వతీ పరమేశ్వరుల ముద్దుల తనయుడు ఆదిగణపతికి హిమ పర్వతం అలంకారం జరిపించారు. సుప్రభాత సేవతోపాటు గోమాయ, గోమూత్ర, గోక్షీరోదకాలతో ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయం వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో పంచమ వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో మొదటి రోజు ఉదయం కలశ స్థాపన, సర్వోతభద్ర మండపారాదన, అగ్ని ప్రతిష్ట చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఆలయాన్ని అభివృద్ధి చేసి మహాకుంభాభిషేకం నిర్వహించినట్లు గుర్తుచేశారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, డాక్టర్ గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొమురయ్య, గుండేటి కృష్ణమూర్తి, మండల శ్రీరాములు, పాశికంటి రమేష్, ప్రభాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ, జోగయ్య, అర్చకులు రజనీకుమార్, మార్త సందీప్, శివ, అంకం కళ్యాణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐకేఎంఎస్ మహాసభలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు కోరారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో యాదాద్రి జిల్లా ఆలేరులో జరగనున్న సంఘం మహాసభల వాల్‌పోస్టర్లను వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సంఘం నాయకులతో కలిసి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయం నుంచి రైతుకూలీ ప్రదర్శన ప్రారంభమవుతుందని, 2గంటలకు బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.అచ్యుత రామారావు అధ్యక్షత వహిస్తారని, ప్రధాన వక్తగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇనుముల కృష్ణ, ఎండీ.అక్బర్, పాపయ్య, అమర్, చేరాలు, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘాలను బలోపేతం చేస్తాం



ర్యాలీగా వెళ్తున్న సంఘం నాయకులు

వరంగల్ చౌరస్తా: మున్నూరుకాపు యువజన విభాగాన్ని తెలంగాణలోని అన్ని జిల్లాల్లో బలోపేతం చేస్తామని మున్నూరుకాపు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. నగరంలోని వివేకానంద జూనియర్ కళాశాల నుంచి హనుమకొండలోని మాతా గార్డెన్ వరకు వరంగల్ జిల్లా యువజన అధ్యక్షుడు కొరివి పరమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ద్విచక్ర, వాహన ర్యాలీని దేవయ్య పటేల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాలు పర్యటించి నూతన యువజన జిల్లా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో మున్నూరు కాపు సంఘం బలోపేతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ బండి కుమారస్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, మున్నూరుకాపు నాయకులు రాజనాల శ్రీహరి, హరిశంకర్, పెరుకారి శ్రీధర్, కనుకుంట్ల రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారికి పూజలు, వాహనసేవలు జరుగుతాయని ముదిరాజ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు అధికసంఖ్యలో హాజరై పూజలో పాల్గొనాలని కోరారు.


నియామకం

టీఏడీయూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్



దేశాయిపేట: టీఏడీయూ (తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లి గ్రామానికి చెందిన హింగె శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈమేరకు యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీఆంజనేయ మున్నూరుకాపు పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక



రవికుమార్, ప్రధాన కార్యదర్శి

కాశోజీ సెంటర్: శ్రీఆంజనేయ మున్నూరుకాపు పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పద్మాక్షిగుట్ట సమీపంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన సంఘం 14వ వార్షిక సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గంద కృష్ణ తెలిపారు. అధ్యక్షుడిగా దశరథ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల రవికుమార్, కోశాధికారిగా గొల్లపల్లి చిరంజీవి, ఆడిటర్‌గా దేవులపల్లి సంపత్, డైరెక్టర్‌గా ముత్యాల రాజును ఎన్నుకున్నట్లు వివరించారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం పదవిలో ఉంటుందని వివరించారు. కాగా, 150మంది సభ్యులున్న ఈ సంఘం... 14 ఏళ్లుగా దిగ్విజయంగా సాగుతుందని తెలిపారు.

బీజేపీ 38వ డివిజన్ ఉపాధ్యక్షుడిగా శ్రీను



ఖిలా వరంగల్: బీజేపీ 38వ డివిజన్ ఉపాధ్యక్షుడిగా కంద్రాతి శ్రీను నియమితులయ్యారు. ఈమేరకు శ్రీనుకు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ విద్యార్థుల వీడ్కోలు



మాట్లాడుతున్న కుమారస్వామి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గుడిబడి) ఓపెన్ స్కూల్ సెంటర్‌లో ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ అజయ్‌బాబు మాట్లాడుతూ చదువు.. మనిషిని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందని వివరించారు. అనివార్యంగా చదువుకు దూరమైన వారు తిరిగి చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ ఎంతో దోహద పడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కుమారస్వామి, కౌన్సిలర్లు సంపత్, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రోడ్లపైకి చేరిన బురద



58వ డివిజన్ ఇంద్రానగర్‌లో..



భవానినగర్‌లో రోడ్డుపై మురుగు

హన్మకొండ: భారీ వర్షానికి వరద రావడంతో మురుగు కాలువలు, రోడ్లపైకి చెత్తాచెదారంతో పాటు బురదవచ్చి చేరింది. దాంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రెయినేజీలను శుభ్రం చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హనుమకొండలోని ఇంద్రానగర్, భవానినగర్, గోకుల్‌నగర్, అశోకకాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు విద్యార్థుల ప్రగతిపై సమీక్ష



శంభునిపేటలో సమావేశమైన తల్లిదండ్రులు (ఫైల్)

కాశోజీ సెంటర్: విద్యార్థుల అభ్యసనాభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ.. ప్రతీ పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ కమిటీలను ఏర్పాటు చేసి తల్లిదండ్రుల పాత్రను విస్తృతం చేశారు. విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో విద్యా ప్రమాణాలు లేవనేది నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–21(న్యాస్)2022 సంవత్సరంలో వెల్లడైంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంచేలా తొలిమెట్టు కార్యక్రమం చేపట్టింది. ప్రతీ నెల మూడో శనివారం పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల ప్రగతిపై సమీక్షించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ(పీటీఎం) సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో 645 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఈసమావేశంలో ప్రతీ విద్యార్థి చదువులో పురోగతిని అందిపుచ్చుకునేలా పాఠశాలలోని మౌలిక సౌకర్యాల గురించి చర్చించి సూచనలు, సలహాల్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రికార్డు నమోదు చేసి మరుసటి నెల మూడో శనివారం సమావేశం వరకు తీసుకున్న చర్యలపై చర్చించనున్నారు. ఇలా.. చేయడంతో చదువులో వెనుకబడిన విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టికి వెళ్తుంది. వెంటనే తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివిస్తారని పీటీఎం సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈవిద్యాసంవత్సరం చివరి మూడో శనివారం సెలవుదినం కాబట్టి సోమవారం అన్ని పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్ తల్లిదండ్రుల సమక్షంలో అందజేయనున్నారు.

తల్లిదండ్రుల పాత్ర అవసరం

విద్యార్థుల అభ్యసనాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా అవసరం. పిల్లల విద్యా ప్రగతిపై చర్చించడానికి పీటీఎం సమావేశాలు ఉపయోగకరంగా ఉంటున్నాయి. వేసవి సెలవుల్లో వృథాగా తిరగనీయకుండా విద్యా ప్రమాణాలు పెంచేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి.

– డి.వాసంతి, డీఈఓ, వరంగల్

రేపు నియోజకవర్గ స్థాయి ప్లీనరీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్

కాశిబుగ్గ: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25వ తేదీన నియోజకవర్గ ప్లీనరీని ఘనంగా నిర్వహించేందుకు ఓసిటీలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. ఓసిటీ మైదానంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ టి.రమేష్‌బాబు, కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, దిడ్డి కుమారస్వామితో కలిసి ఎమ్మెల్యే వివరాలు వెల్లడించారు. ప్లీనరీకి ఆరువేల మంది హాజరవుతారని తెలిపారు. 25న ఉదయం నియోజకవర్గంలోని 46జెండా గద్దెల వద్ద జెండా పండుగ, 26న పుప్పాలగుట్టలోని పార్కులో నిర్వహిస్తున్న తొలి ఆత్మీయ సమ్మేళనం, 27న రాష్ట్ర లెజిస్లేటివ్ సమావేశం, 30న కొత్త సచివాలయ ప్రారంభోత్సవం, 1న మేడే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మే 13వ తేదీ నుంచి వరుసగా ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగి 30వ తేదీన ముగుస్తాయని తెలిపారు. కాగా, 26న ఉదయం దేశాయిపేటలోని జర్నలిస్ట్‌కాలనీలో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూంల కేటాయింపుపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ వస్కుల బాబు, ఆర్‌టీఏ సభ్యులు గోరంటల మనోహన్, మాజీ కార్పొరేటర్లు బయ్యా స్వామి, కుందారపు రాజేందర్ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

హన్మకొండ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ.. మాట తప్పిందని ధ్వజమెత్తారు. దేశంలో అనేక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదించుకుంటున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే బిల్లుపై జాప్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 50రోజుల పాటు అన్ని గ్రామాల్లో సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేసి మాదిగ ప్రజలను పోరాటానికి సిద్ధం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మే 5న హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వేల్పుల సూరన్న, కొయ్యడ మల్లేశం, బుర్రి సతీష్ మాదిగ, జన్ను దినేష్, కందికట్ల విజయ్, కళ్లెపల్లి ప్రణయ్, శంకర్, ముఖేష్, గంగారపు శ్రీనివాస్, గద్దల సుకుమార్, బిర్రు మహేందర్, ఇనుముల నర్సయ్య, మడిపల్లి శ్యామ్, అంబాల చంద్రమౌళి, బాబురాజు, కట్ల రాజశేఖర్, తడుగుల విజయ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రేపు రామానుజాచార్యుల శోభాయాత్ర

వరంగల్ చౌరస్తా: ఈనెల 25న సాయంత్రం జగద్గురు భగవత్ రామానుజాచార్యుల శోభాయాత్రను నిర్వహించనున్నట్లు గోవిందరాజుల గుట్ట దేవస్థానం ప్రధాన అర్చకులు, చాత్తాద వైష్ణవ సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరయోగుల శ్రీనివాసస్వామి తెలిపారు. వరంగల్ గోవిందరాజుల దేవస్థానం ఆవరణలో శోభాయాత్ర వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చకులు వరయోగుల లక్ష్మణస్వామి, వేణుమాధవ్ స్వామి, తిరునగరి రవికుమార్, రామానుజన్ జగదీశ్వర్, దాస్యం శ్రీనివాస్, మెట్టుపల్లి శ్రీనివాస్, వేణుగోపాల్, దామోదర్, దాస్యం నవీన్‌కుమార్, ట్రస్ట్ బాధ్యులు రవీంద్రనాథ్, వేణుమాధవ్, సత్యనారాయణ, కర్నె రవీందర్ పాల్గొన్నారు.

శంకర భగవత్పాద సమారాధన..

వరంగల్ చౌరస్తా: ఈనెల 25న శంకర జయంతి సందర్భంగా శంకర భగవత్పాద సమారాధన, సింహావాన సేవ, గజవాహన సేవ, మహా ప్రసాత దివరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రకాళి కల్యాణం సందర్భంగా ఆర్యవైశ్యులందరు పాల్గొనాలని కార్యక్రమ కన్వీనర్ దాచేపల్లి సీతారాం కోరారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై దేవులపల్లి అశోక్ ఆధ్వర్యంలో ప్రయాణికులు, బాటసారులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై పీఏసీఎస్ చైర్మన్ కోడల జనార్దన్‌తో కలిసి మజ్జిగా అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, పగడాల సతీష్, అశోక్, మార్త శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.